## 277వ అధ్యాయం

# ٢٧٧ ـ بَابُ تَحْرِيمِ الْغَدْرِ

# వాగ్దాన ద్రోహం నిషిద్ధం

قَالَ اللهُ تَعَالَى: ﴿يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓاْ أَوْفُواْ بِٱلْعُقُودِ﴾ [المائدة: ١]. وَقَالَ تَعَالَى: ﴿وَأَوْفُواْ بِٱلْعَهْدِ إِنَّ ٱلْعَهْدَ كَانَ مَسْـُٔولًا﴾ [الإسراء: ٣٤].

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"విశ్వాసులారా! కట్టుబాట్లను పూర్తిగా పాటించండి." (మాయిద: 1)

"చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి. నిస్సందేహంగా వాగ్దానం విషయంలో మీరు సమాధానం చెప్పవలసి ఉంటుంది." (ఇస్రా:34)

## ముఖ్యాంశాలు

వాగ్దానాలు రెండు రకాలు. ఒకరకం వాగ్దానం మానవులు పరస్పరం చేసుకునేది. రెండవది, మానవులు తాము అల్లాహ్ ఏకత్వాన్ని ఆయన ప్రభుత్వాన్ని అంగీకరించి, ఆయన ఆజ్ఞల్ని, ఆదేశాల్ని పాటిస్తామని ఆయనతో చేసిన వాగ్దానం. ఈ రెండు రకాల వాగ్దానాలను బాధ్యతతో నెరవేర్చటం చాలా అవసరం. లేదంటే రేపు ప్రళయ దినాన దాని గురించి నిలదీయటం జరుగుతుంది.

١٥٨٦ ـ وعَنْ عَبْدِ اللهِ بْنِ عَمْرِو بْنِ العَاصِ رَضِيَ اللهُ عَنْهُمَا أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «أَرْبَعٌ مَنْ كُنَّ فيه، كَانَ مُنَافِقاً خَالِصاً، وَمَنْ كَانَتْ فيه خَصْلَةٌ مِنْهُنَّ، كَانَ فِيهِ خَصْلَةٌ مِنَ النِّفَاقِ حَتَّى يَدَعَهَا: إِذَا اؤْتُمِنَ خَانَ، وَإِذا حَدَّثَ كَذَبَ، وَإِذا عَاهَدَ غَدَرَ، وَإِذا خَاصَمَ فَجَرَ» متفقٌ عليه.

1586. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: నాలుగు లక్షణాలున్న వ్యక్తి పచ్చి కపటిగా పరిగణించ బడతాడు. ఒకవేళ వాటిలో ఏ ఒక్క లక్షణం అతనిలో ఉన్నా దాన్ని వదలిపెట్టనంత వరకూ అతనిలో ఒక కపట లక్షణం ఉన్నట్లుగా భావింపబడుతుంది. (ఆ నాలుగు లక్షణాలు ఇవి:) 1) అతనికి ఏదైనా అప్పగిస్తే అందులో అతను ద్రోహానికి పాల్పడతాడు. 2) మాట్లాడితే

అబద్ధం చెబుతాడు. 3) వాగ్దానం చేసి ఆ తర్వాత మోసం చేస్తాడు. 4) ఎవరితో నయినా పోట్లాడితే నోరు పారేసు కుంటాడు. (బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీ-సహీహ్ ముస్లిం)*

## ముఖ్యాంశాలు

ఈ హదీసు ఇంతకుముందు 1544వ హదీసు క్రింద కూడా వచ్చింది. ఇందులో కపట విశ్వాసుల లక్షణాలు వివరించబడ్డాయి. నిజమైన విశ్వాసులు తమలో ఈ లక్షణాలు లేకుండా పవిత్రంగా ఉండాలి. మంచి నడవడికకు విశ్వాసంతో అవినాభావ సంబంధముంటుంది. విశ్వాసమున్నచోట ఉత్తమ నడవడిక కూడా తొణికిసలాడుతూ ఉంటుంది. అలాగే విశ్వాసం లేనిచోట నడవడిక కూడా కానరాదు.

١٥٨٧ ـ وَعَنِ ابْنِ مَسْعُودٍ، وَابْنِ عُمَرَ، وأَنَسٍ رَضِيَ اللهُ عَنْهُمْ قَالُوا: قَالَ النَّبِيُّ ﷺ: «لِكُلِّ غادِرٍ لِوَاءٌ يوْمَ القِيَامَةِ، يُقَالُ: هذِهِ غَدْرَةُ فُلانٍ» متفقٌ عليه.

1587. హజ్రత్ ఇబ్నెమస్‌వూద్, ఇబ్నె ఉమర్, అనస్ (రజి)ల కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ప్రళయదినాన వాగ్దాన ద్రోహం చేసిన వారిలో ప్రతి ఒక్కరికీ ఒక జెండా ఉంటుంది. "ఇతను ఫలానా వ్యక్తికి వాగ్దాన ద్రోహం చేసినందుకు ఇది గుర్తు" అని ప్రకటించటం జరుగుతుంది. (బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

గదర్ అంటే వాగ్దాన భంగం చేయటం, వాగ్దానాన్ని లెక్కచేయకపోవటం అని అర్థం. ప్రళయదినాన ఇలాంటి వాగ్దాన ద్రోహులందరికి అందరిముందు జెండాలు ఇవ్వబడతాయి. అది వారి వాగ్దాన ద్రోహానికి ఒక చిహ్నంగా ఉంటుంది.

١٥٨٨ ـ وَعَنْ أَبِي سَعِيدٍ الخُدْرِيِّ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «لِكُلِّ

1588. హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు:

غَادِرٍ لِوَاءٌ عِنْدَ اسْتِهِ يَوْمَ الْقِيَامَةِ يُرْفَعُ لَهُ بِقَدْرِ غَدْرِهِ، أَلَا وَلَا غَادِرَ أَعْظَمُ غَدْراً مِنْ أَمِيرِ عَامَّةٍ» رواه مسلم.

ప్రళయదినాన ప్రతి వాగ్దాన ద్రోహి పిరుదుల దగ్గర ఒక జెండా ఉంటుంది. అతని ద్రోహ తీవ్రతను బట్టి అది పైకెత్తబడి ఉంటుంది. వినండి! జన సామాన్య నాయకునికి చేసిన వాగ్దానంలో ద్రోహానికి ఒడిగట్టినవాడి కన్నా పెద్ద వాగ్దానద్రోహి మరొకడు లేడు.

(ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని జిహాద్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

జనసామాన్యానికి నాయకుడంటే సమకాలీన ప్రభుత్వాధిపతి (ఖలీఫా, రాజు, పాలకుడు) లేక అతని ప్రతినిధి అని అర్థం. అతని వాగ్దానాన్ని భంగపరచటమంటే అతనికి విధేయత చూపుతామని చేసిన వాగ్దానాన్ని, ప్రమాణాన్ని భంగపరచి అతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయటం. ఇస్లాం ధర్మం ప్రభుత్వాధికారుల్ని విమర్శించమనీ, ఖుర్ఆన్ హదీసుల వెలుగులో వారిని సంస్కరించమని తాకీదు అయితే చేస్తుంది. దానికోసం అది 'మంచిని ఆజ్ఞాపించు చెడుని నివారించు' అనే ప్రతిపాదన కూడా చేస్తుంది. కాని వారి పాప వైఖరిని, దౌర్జన్యాన్ని ఆసరాగా చేసుకొని వారికి చేసిన విధేయతా వాగ్దానాన్ని భంగపరిచి వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయటానికి మాత్రం ఇస్లాం ధర్మం అనుమతించదు. ఎందుకంటే దానిమూలంగా దేశంలో అరాచకం, అశాంతి అలజడులు చెలరేగుతాయి. ఫలితంగా పరిస్థితులు చక్కబడక పోగా మరింత విషమిస్తాయి. ఖలీఫాలకు, సుల్తానులకు వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటుల చరిత్రను పరిశీలించినా మనకు దీని ప్రయోజన ప్రాముఖ్యతలు బోధపడతాయి. చరిత్రలో ఇప్పటివరకు ఎన్ని తిరుగుబాట్లు జరిగాయో అన్నిట్లోనూ ముస్లిం సమాజానికి లేక ఇస్లాం ధర్మానికి విపరీతమైన నష్టమే తప్ప ఏ ప్రయోజనమూ కలగలేదు.

నేటి ప్రజాస్వామిక వ్యవస్థలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు మొదలగువాటిని ప్రజాస్వామ్యంలో భాగంగా , పైగా ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రాణంగా భావిస్తారు. కాని నిజానికి ఆ విధానం ప్రజాస్వామ్య వ్యవస్థకు కూడా ప్రయోజనదాయకం కాదు. దానివల్ల పరిపాలకుల వైఖరి మారుతుందన్న ఆశ లేదు, దేశానికి, జాతికి కూడా దాని మూలంగా ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాని విధ్వంసం మూలంగా ప్రజల ఆస్తులకు, జాతి సంపదకు నష్టం కలుగుతుంది. కొన్నికొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతుంది. కనుక ఈ రాజకీయ నిరసన ప్రదర్శనలు కూడా షరీఅత్ దృష్టిలో కాస్త చర్చించదగినవే. పరిపాలకులకు వ్యతిరేకంగా

ఈ విధమైన చర్యలకు పాల్పడటాన్ని ఈ హదీసులో తీవ్రంగా గర్హించటం జరిగింది. కనుక అధికారంలో ఉన్న పాలకుల సంస్కరణ కోసం 'మంచిని ఆజ్ఞాపించి, చెడుని నివారించు' అన్న విధిని నిర్వర్తించటం కోసం మనం వేరొక సముచితమైన మార్గాన్ని అవలంబించాలి. అందులో విమర్శ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా సరైన శ్రేయోభిలాషతో, జాతి, దేశ ప్రయోజనాల దృష్టితో జరగాలి. అంతేగాని ఈ ధర్నాలు, రాజకీయ సమ్మెలు, రాస్తారోకోలు షరీఅత్ దృష్టిలోనూ తప్పే. వీటిమూలంగా నష్టమే తప్ప లాభం ఉండదని అనుభవాలు హెచ్చరిస్తున్నాయి.

2) అరబ్బుల్లో వాగ్దాన ద్రోహానికి పాల్పడేవారిని అపఖ్యాతికి, అవమానానికి గురిచేసేందుకు బజార్లలో వారిపేరు మీద జెండాలు నాటే రివాజు ఉండేది. ప్రజలు ఆ పాపాన్ని, దానికి పడే శిక్షను అర్థం చేసుకోవటానికి దేవుడు కూడా వారి రివాజు ప్రకారమే వారికి పరలోకంలో విధించబడనున్న శిక్ష గురించి వివరించాడు.

١٥٨٩ - وعنْ أبي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ عن النَّبيِّ ﷺ قَالَ: «قَالَ اللهُ تَعالى: ثَلاثَةٌ أَنَا خَصْمُهُمْ يَوْمَ القِيامَةِ: رَجُلٌ أَعْطَى بي ثُمَّ غَدَر، وَرَجُلٌ بَاعَ حُرًّا فَأكَلَ ثَمَنَهُ، وَرَجُلٌ اسْتَأْجَرَ أَجِيراً، فَاسْتَوْفى مِنْهُ، وَلَمْ يُعْطِهِ أَجْرَهُ» رواه البخاري.

1589. దేవుడు ఈ విధంగా అన్నాడంటూ దైవప్రవక్త (సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైరా (రజి) తెలియజేశారు: ఒకడు నా పేరు మీద వాగ్దానం చేసి మోసం చేసినవాడు. మరొకడు, స్వేచ్ఛాపరుణ్ణి అమ్మి ఆ డబ్బు తిన్నవాడు. ఇంకొకడు, ఒక మనిషిని కూలికి పెట్టుకొని అతనితో బాగా పని చేయించుకుని కూలి ఇవ్వకుండా ఎగవేసినవాడు. ఈ ముగ్గురితో ప్రళయదినాన నేను స్వయంగా గొడవ పడతాను. (బుఖారీ)

(సహీహ్ బుఖారీలోని లావాదేవీల ప్రకరణం)